
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



నంద్యాల
జిల్లా వార్తలు
5
సోమవారం 30 జూన్ 2025



తెగిన తీగలు

- పొంచి ఉన్న ప్రమాదాలతో గాలిలో కలుస్తున్న ప్రాణాలు
- విద్యుత్ తీగలు తెగి రెండేళ్లలో 100 మంది మృత్యువాత
- అధికారుల పర్యవేక్షణ గాలికి
- పరిహారం అంతంతే..

● నంద్యాల డివిజన్ సంజామల మండలం ఆకుమల్ల గ్రామానికి చెందిన పి. రసూల్‌బాషా (50) అనే రైతు గత ఏడాది జూన్ 22వ తేదీన ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతు చేస్తుండగా.. 11 కేవీ వైర్ తగిలి మృతి చెందాడు.

● డోన్ డివిజన్ ప్యాపిలి మండలం జలదుర్గం గ్రామానికి చెందిన సి. వెంకటరమణ(21) గత ఏడాది మే 5వ తేదీన తమ పొలంలో దున్నుతుండగా.. కరెంట్ తీగలు తెగిపడి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు.

● ఆత్మకూరు డివిజన్ జూపాడుబంగ్లా మండల పరిధిలోని తార్తూరు గ్రామానికి చెందిన ఎం. మల్లయ్య(28) గత ఏడాది ఏప్రిల్ 24వ తేదీన 11 కేవీ వైర్ నుంచి సర్వీస్ కనెక్షన్ తీసుకుంటుండగా.. విద్యుత్ షాక్ తగిలి అక్కడిక్కడే మృతి చెందాడు.

నంద్యాల, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఇవి కొన్ని మాత్రమే. ఇలాంటివి ఇంకెన్నో జరిగి ఉంటాయి. అయితే ఈ ప్రమాదాలు యాదృచ్ఛికం కాదు. కాలం చెల్లిన విద్యుత్ తీగలు.. విద్యుత్ స్తంభాలను అధికారులు మార్చడకపోవడం వల్ల తరచుగా జిల్లాలో ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. ఏకంగా వందల్లో మృతులు ఉండటం కలవరం రేపుతోంది. ఈ మరణాలు వారి కుటుంబాల్లో తీరని విషాదం నింపుతోంది. ప్రజలకు అవగాహన లేకపోవడం, విద్యుత్ శాఖ అధికారుల పర్యవేక్షణ చేయకపోవడం, కాలం చెల్లిన వాటికి మరమ్మతులు చేయకపోవడం.. వెరసి రైతుల ప్రాణాల్లో గాలిలో కలిసిపోతున్నాయి. అధికార లెక్కల ప్రకారం జిల్లా వ్యాప్తంగా గత రెండేళ్లలో వంద వరకు మృతుల సంఖ్య ఉందంటే క్షేత్రస్థాయిలో పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఎక్కడికక్కడ తెగుతున్న తీగలు..

జిల్లా పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నో ఏళ్ల కిందట ఏర్పాటు చేసి విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగలే నేటికి ఉన్నాయి. చాలా వాటికి కాలం చెల్లినా కూడా మార్చలేదు. ఈ పరిస్థితుల్లో కాలం చెల్లిన విద్యుత్ తీగలు ఎక్కడికక్కడ తెగిపడుతున్నాయి. విద్యుత్ స్తంభాలు కూడా కూలిపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎక్కడైనా ఘటన జరగ్గానే అధికారులు హడావిడి చేసి, ఆ తర్వాత ఆవైపు కన్నెత్తి కూడా చూడటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీని వల్లే తరచూ ప్రమాదాలు జరుగుతూ ఉన్నాయనే ఆరోపణలు ఉన్నాయి. మరీ దారుణం ఏమిటంటే.. విద్యుత్ తీగలు తెగితే..అతుకులు వేసే కండక్టర్లు ఆశించిన స్థాయిలో లేవని అధికారులే అంటున్నారు.

వేధిస్తున్న సిబ్బంది కొరత...

కర్నూలు జిల్లా నుంచి నంద్యాల జిల్లా ఏర్పడ్డాక రెండు చోట్లా సిబ్బంది కొరత ఏర్పడింది. జిల్లా విద్యుత్‌శాఖలో ప్రధానంగా లైన్‌మెన్, అసిస్టెంట్ లైన్‌మెన్, జూనియర్ లైన్‌మెన్, జేఎల్ఎం పోస్టుల కొరత ఎక్కువగా ఉంది. నిబంధనల ప్రకారం.. 700 నుంచి 1000 విద్యుత్ సర్వీసులకు ఒక లైన్‌మెన్ ఉండాల్సి ఉంది. ఈ నేపథ్యంలో చాలా మండలాల్లో ఏఈల కొరత ఉంది. దీంతో ఇన్‌చార్జిలతో నెట్టుకొస్తున్నారు. కొన్నేళ్లుగా ప్రధాన పోస్టులు భర్తీ చేయకపోవడంతో మరింత ఇబ్బందిగా ఉంది. ఈ నేపథ్యంలో ఎక్కడిక్కడ ఆశించినంత మంది క్షేత్రస్థాయిలో సిబ్బంది లేకపోవడంతో రైతులు, వినియోగదారులు ఏదైనా సమస్యపై ఫిర్యాదు చేస్తే.. ఉన్న సిబ్బంది కొరతతో సకాలంలో పరిష్కరించలేక పోతున్నామని అధికారులు అంటున్నారు. దీని వల్ల ప్రజలే తమ సమస్యను పరిష్కరించుకోడానికి ప్రయత్నించి ప్రమాదాలకు గురై ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. కొన్ని ప్రాంతాల్లో సిబ్బంది కొరతతో అధికారులు ఫోన్‌లో రైతులకు సలహాలు ఇస్తున్నారు. ఆ మేరకు మరమ్మతులకు స్థానికులు ప్రయత్నించి ప్రమాదాలకు గురవుతున్నారు.

పరిహారం అంతంతే...

జిల్లా వ్యాప్తంగా గత రెండేళ్లలో 100 మంది మృతి చెందగా.. కేవలం 30 మందికి మాత్రమే పరిహారం వచ్చినట్లు అధికార లెక్కలు చెప్తున్నాయి. ఇందుకు కారణం.. చాలా కేసుల్లో విద్యుత్‌శాఖ తప్పిదం లేదని నివేదిక ఇవ్వడమే. వాస్తవంగా ఎవరైనా విద్యుత్ ప్రమాదంతో మృతి చెందితే.. మృతుడి కుటుంబానికి రూ. 5లక్షలు ఎస్పీడీసీఎల్ కింద పరిహారంగా అందజేయాలి. ఆయితే... ఎవరైనా మృతి చెందితే కుటుంబ సభ్యులు డెత్ సర్టిఫికెట్‌తో పాటు సమగ్ర వివరాలతో అధికారులకు పరిహారం కోసం దరఖాస్తు చేసుకోవాలి. సిబ్బంది వాటిని ఉన్నతాధికారులకు పంపడంలో చేస్తున్న జాప్యం వల్ల కూడా సకాలంలో పరిహారం అందడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో బాధిత కుటుంబ సభ్యులు పరిహారం కోసం కార్యాలయాలు చుట్టూ తిరగక తప్పడం లేదు.



మహానంది మండలం శ్రీనగరం గ్రామంలోని పొలంలో ఇలా..

సొంతంగా మరమ్మతులు చేసుకోకూడదు



రైతులు, వినియోగదారులు ఏదైనా విద్యుత్ సమస్య వస్తే.. సొంతంగా మరమ్మతులు చేసుకోరాదు. విద్యుత్ అధికారులు, సిబ్బందిని సంప్రదించాలి. విద్యుత్ సమస్యలపై టోల్‌ఫ్రీ నెంబర్ 1912 ద్వారా ఫిర్యాదు చేయాలి. పరిహారం కోసం వచ్చిన దరఖాస్తులను సకాలంలో పరిశీలించి చర్యలు తీసుకుంటాం. అక్కడికక్కడ ఎఫ్ఐఆర్, పోస్టుమార్టం నివేదిక రాకపోవంతో పరిహారం జాప్యమవుతోంది.

– సుధాకర్ కుమార్, విద్యుత్ శాఖ ఎస్ఈ

జిల్లాలో పరిస్థితి ఇలా...

డివిజన్ పేరు	సంవత్సరం	మృతులు
నంద్యాల	2024-25	55
ఆత్మకూరు	2024-25	09
డోన్	2024- 25	24
నంద్యాల	2025-26	(ఇప్పటి వరకు)06
ఆత్మకూరు	2025-26	02
డోన్	2025-26	04
మొత్తం		100

- మొత్తం మృతి చెందిన వారి సంఖ్య :100
- పరిహారం పొందిన కుటుంబాలు : 30
- విద్యుత్‌శాఖలో ఉద్యోగులు కొరత...
- ఏఈలు : 13మంది
- లైన్‌మెన్లు : 39
- అసిస్టెంట్ లైన్‌మెన్లు :32
- జూనియర్ లైన్‌మెన్లు : 172
- జేఎల్ఎంలు : 21
- ఏడీఈ :01
- ఏఏఓలు : 03

శ్రీశైలంలో భక్తుల రద్దీ



క్యూలో నిల్చున్న భక్తులు

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం భ్రమరాంబికా మల్లికార్జునస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వేకువజామునే భక్తులు కళ్యాణకట్టలో తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించిన స్వామి అమ్మవార్ల దర్శనం కోసం తెల్లవారుజాము నుంచే క్యూలైన్‌లలో బారులు తీరారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.

ప్రసాదాల తయారీపై ఆందోళన వద్దు

- లడ్డూలో బొద్దింక వచ్చిందన్న భక్తుడి ఆరోపణల్లో నిజం లేదు
- శ్రీశైలం ఈవో శ్రీనివాసరావు వివరణ

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం భ్రమరాంబికా మల్లికార్జునస్వామి ఆలయంలో భక్తులకు విక్రయిస్తున్న ప్రసాదాల తయారీలో ఎలాంటి ఆందోళన వద్దని ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు భక్తులకు సూచించారు. లడ్డూలో బొద్దింక వచ్చిందంటూ ఆదివారం ఓ భక్తుడు చేసిన ఆరోపణలో నిజం లేదని ఈవో వివరణ ఇచ్చారు. ఈవో మాట్లాడుతూ దేవస్థానంలో చేసే అన్ని ప్రసాదాలు ఆలయ సాంప్రదాయాలకు అనుగుణంగా, పూర్తి నియమనిష్ఠలతో తయారు చేస్తామన్నారు. నాణ్యతలో ఎలాంటి రాజీ పడకుండా సీసీ కెమెరాల నిఘాతో. అధికారుల నిరంతర పర్యవేక్షణ ఉంటుందన్నారు. లడ్డూపోటును ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తున్నామని చెప్పారు. గతంలో ఇలాగే ఆరోపణలు వస్తే అది అవాస్తవమని నిర్ధారించినట్లు తెలిపారు. క్షేత్ర ప్రతిష్ఠతను, భక్తుల మనోభావాలను భంగపరిచే విధంగా అవాస్తవాలు చేయడం తగదని, అధికారులకు మనోవేదనను కలుగజేస్తాయని అన్నారు.

గొర్రెలకు వదిలేశారు



చాగలమర్రిలో పూలతోటను మేస్తున్న గొర్రెలు

చాగలమర్రి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని పక్రుద్దీన్ అనే రైతు సన్నజాజిపూల తోటను గొర్రెలకు వదిలేశాడు. ఎకరం పొలంలో సన్నజాజి పూల తోటను సాగు చేశాడు. వైరస్ వల్ల తోట దెబ్బతింది. రూ.50 వేలు ఖర్చు చేసి పురుగు మందులు వాడినా పూలు రాలేదు. మొక్కలు ఎర్రబారి దెబ్బతిన్నాయి. దీంతో ఆదివారం గొర్రెలకు వదిలేశారు. సుమారు రూ.లక్ష దాక పెట్టుబడి పెట్టానని, మరో పక్క ధరలు, తెగుళ్ల వల్ల నష్టపోయామని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ఉద్యానశాఖ ద్వారా రాయితీ కల్పించి ఆదుకోవాలని రైతు కోరారు.

మిరప పంట దున్నేశారు

రుద్రవరం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆర్.నాగులవరం గ్రామానికి చెందిన వెంకటసుబ్బయ్య అనే రైతు ఆదివారం మూడు ఎకరాల్లో సాగు చేసిన మిరప పంటను దున్నివేశారు. మిరప మొక్కలకు ముడత తెగులు సోకడంతో ఎదుగు బొదుగు లేకుండా పోయింది. ఎన్ని మందులు పిచికారి చేసినా మొక్కల్లో ఎదుగుదల లేకపోవడంతో పంటను దున్నివేశాడు. ఇప్పటి వరకు మూడుఎకరాలకు రూ.2లక్షలు పెట్టుబడి పెట్టానని అంతా నేలపాలైందని ఆవేదన వ్యక్తం చేశారు.



నాగులవరంలో ట్రాక్టరుతో మిరప పంటను దున్నేస్తున్న అన్నదాత

జమిలి ఎన్నికలు తథ్యం: పెద్దిరెడ్డి

నంద్యాల రూరల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): 2027 ఫిబ్రవరిలో జమిలి ఎన్నికలు తథ్యమని, ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని మాజీ మంత్రి, వైసీపీ రాయలసీమ కో ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని సూరజ్ గ్రాండ్ హోటల్‌లో ఆదివారం పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషి జమిలి ఎన్నికలు వస్తాయని పేర్కొన్నారన్నారు. ఎన్నికల దృష్ట్యా ఇప్పటి నుంచే వైసీపీ ఎన్నికలకు సిద్ధం కావాలని కోరారు. వైసీపీ హయాంలో ప్రజలకిచ్చిన హామీలను తూచా తప్పకుండా నెరవేర్చారన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చిన హామీలను నెరవేర్చలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటి నుంచే వైసీపీ శ్రేణులు ప్రజల ఆదరాభిమానాలను చూర గొనేందుకు చక్కటి ప్రణాళికతో ముందుకు వెళ్లాలన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి వస్తుందని అన్నారు. అనంతరం పార్టీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాల అమలులో వైఫల్య తీరును గ్రామ, మండలస్థాయిలో ప్రతి ఇంటికి వెళ్లి వివరించాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, నంద్యాల నియోజకవర్గ పరిశీలకురాలు ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి, జిల్లా ఇన్‌చార్జిలు, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్నరామచంద్రారెడ్డి

ఖరీఫ్ పంటలకు బీమా

- ఉత్తర్వులు జారీ
- రైతులంతా వినియోగించుకోవాలని జేడీ విజ్ఞప్తి



కర్నూలు అగ్రికల్చర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్‌లో ఆరున్నర లక్షల ఎకరాల్లో పత్తి, వేరుశనగ, కంది, మొక్కజొన్న తదితర పంటలను రైతులు సాగు చేస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాలతో పాటు అకాల వర్షాలు, తెగుళ్ళ, క్రిమికీటకాలు పంటలను కబళిస్తున్నాయి. ఎంతో వ్యయ ప్రయాసల కోర్చి రైతులు సాగు చేసిన ఈ పంటలు చేతికందే సమయంలో పంటలన్నీ వర్షాభావం వల్లనో, భారీ వర్షాలు, తెగులు, క్రిమికీటకాల వల్లనో మట్టిలో కలిసిపోతున్నాయి. ఈ పరిస్థితుల్లో రైతులకు బీమా కంపెనీల నుంచి నష్టపరిహారాన్ని అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కర్నూలు జిల్లాలో 11 పంటలు, నంద్యాల జిల్లాలో 12 పంటలకు బీమాను వర్తింపజేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పత్తి, వేరుశనగకు మండల యూనిట్‌గా బీమా పథకాన్ని వర్తింపజేయనున్నారు. పత్తికి ఒక హెక్టారుకు రూ.లక్ష బీమాను వర్తింపజేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటా పోను రైతులు ఒక హెక్టారుకు రూ.5వేలు చెల్లించాలి. వేరుశనగకు రూ.70వేల బీమాను నిర్ణయించారు. ఒక హెక్టారుకు రూ.1,400 రైతులు ప్రీమియంగా చెల్లించాలి. అదే విధంగా వరికి రూ.1లక్ష బీమా మొత్తాన్ని ఒక హెక్టారుకు నిర్ణయించి రూ.200 ప్రీమియంగా నిర్ణయించారు. అదే విధంగా మొక్కజొన్నకు రూ.32,500 బీమా మొత్తం కాగా, హెక్టారుకు రూ.155 రైతులు కట్టాల్సిన ప్రీమియాన్ని నిర్ణయించారు. కందికి బీమా మొత్తం రూ.55వేలుగా నిర్ణయించి రైతులు ప్రీమియంగా రూ.110 చెల్లించాలని ప్రభుత్వం ఉత్తర్వులో పేర్కొంది. ఎండుమిర్చి ఒక హెక్టారుకు రూ.2.25 లక్షల మొత్తాన్ని బీమా మొత్తంగా నిర్ణయించి ఒక హెక్టారుకు రూ.900 చెల్లించాలని ఉత్తర్వులో పేర్కొంది. జొన్న రూ.47,500 కు గాను రూ.95, ఆముదం రూ.45వేల బీమా మొత్తానికి రూ.90 ప్రీమియంగా చెల్లించాలి.

రైతులు లబ్ధిపొందాలి

ఈ ఖరీఫ్‌లో పంటలు సాగు చేసిన రైతులందరూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వాతావరణ బీమా, ప్రధాన మంత్రి ఫసల్ బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలి. ప్రకృతి వైపరీత్యాల కారణంగా రైతులు ఏటా రెండు సీజన్లలో పంటలు కోల్పోయి నష్టపోతున్నారు. ఈ నష్టాన్ని నివారించేందుకే ప్రభుత్వం బీమా పథకాలను అమలు చేస్తుంది. రైతులందరూ ఈ ప్రీమియం చెల్లించి బీమా పథకం ద్వారా లబ్ధి పొందాలి.

– వరలక్ష్మి, జేడీ

ముగిసిన సచివాలయ ఉద్యోగుల కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

కర్నూలు న్యూసిటీ, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని కార్పొరేషన్, మున్సిపాలిటీలకు సంబంధించి సచివాలయ ఉద్యోగుల కౌన్సెలింగ్ ఆదివారం ముగిసింది. ఎస్బీఐ కాలనీలో జరిగిన కౌన్సెలింగ్‌కు కర్నూలు నగరపాలక సంస్థతో పాటు నంద్యాల, ఆదోని, ఎమ్మిగనూరు, ఆళ్లగడ్డ, డోన్, ఆత్మకూరు మున్సిపాలిటీలు, గూడూరు నగర పంచాయతీకి సంబంధించిన ప్లానింగ్ సెక్రటరీలు, అమ్యూనిటీస్ సెక్రటరీలు హాజరయ్యారు. ప్లానింగ్ సెక్రటరీలు ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారు 157 మంది, రిక్వెస్ట్ చేసుకున్న వారు 22 మంది, అదేవిధంగా అమ్యూనిటీస్ సెక్రటరీలు ఐదేళ్లు పూర్తి చేసుకున్నా వారు 170 మంది, రిక్వెస్ట్ చేసుకున్న వారు 20 మంది తమకు కావాల్సిన సచివాలయాల కోసం ఆప్షన్ ఇచ్చారు. కార్యక్రమంలో నగర పాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు, అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్‌రెడ్డి, డోన్ కమిషనర్ సుబ్బరాయుడు, గూడూరు కమిషనర్ రమేష్‌బాబు పాల్గొన్నారు.

ఎస్ఎస్‌సీ ఉద్యోగాలకు దరఖాస్తులు

కర్నూలు న్యూసిటీ, జూన్ 29(ఆంధ్రజ్యోతి): స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలని కార్మిక శాఖ ఉప కమిషనర్ కె. వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 2025 సంవత్సరానికి 14,582 పోస్టుల భర్తీకి ఉద్యోగ నోటిఫికేషన్ ప్రకటన ఇచ్చిందని ఆయన పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు హెచ్‌టీటీపీ://ఎస్ఎస్‌సీ.జీవోవి.ఇన్‌లో చూడాలని ఆయన తెలిపారు. జూలై 4వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏపీలో ఈపరీక్ష 24-7-2025 నుంచి 04-08-2025 వరకు జరుగుతుందన్నారు.

డీఎస్సీకి 67 మంది గైర్హాజరు

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో ఐదు పరీక్షా కేంద్రాల్లో ఆదివారం రెండు సెషన్స్‌లో నిర్వహించిన ఏపీ మెగా డీఎస్సీ పరీక్షకు 67 మంది గైర్హాజరయ్యారు. మొదటి సెషన్‌లో ఒక పరీక్ష కేంద్రంలో నిర్వహించిన ప్రిన్సిపాల్ పరీక్షకు మొత్తం 85 మంది అభ్యర్థులకు గానూ 53 మంది అభ్యర్థులు హాజరై 32 మంది గైర్హాజరయ్యారు. రెండో సెషన్‌లో ఐదు పరీక్ష కేంద్రంలో నిర్వహించిన ఎస్ఏ(లాంగ్వేజి) తెలుగు పరీక్షకు 790 మంది అభ్యర్థులకు గానూ 755 మంది అభ్యర్థులు హాజరు కాగా 35 మంది గైర్హాజరయ్యారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగలేదని, పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని డీఈవో జనార్దన్‌రెడ్డి తెలిపారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

నంద్యాల నూనెపల్లె, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): నంద్యాల కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో సోమవారం ఉదయం 9.30 గంటలకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నుంచి వినతులు స్వీకరిస్తామని కలెక్టర్ రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ దరఖాస్తులను మీ కోసం ప్రభుత్వ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా సమర్పించవచ్చని తెలిపారు. మండల, డివిజన్, మున్సిపాలిటీలలోని అధికారులకు కూడా ఇవ్వవచ్చని సూచించారు.

మారకపోతే మార్చేస్తాం

ఉమ్మడి జిల్లాలో పలువురు ఎమ్మెల్యేల పనితీరు బాగా లేదు
టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు

యువకుడి దారుణ హత్య

7

మారకపోతే మార్చేస్తాం

- ఉమ్మడి జిల్లాలో పలువురు ఎమ్మెల్యేల పనితీరు బాగా లేదు
- ఎంపీలు, ఎమ్మెల్యేలు నిత్యం ప్రజల్లో ఉండాలి
- సూపర్ సిక్స్ పథకాలు బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- టీడీపీ అధినేత చంద్రబాబు సూచనలు



సమావేశంలో పాల్గొన్న మంత్రి, ఎంపీ, టీడీపీ నాయకులు

కర్నూలు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గం ఇన్‌చార్జిలు, నామినేటెడ్ పదవులు పొందిన నాయకుల్లో కొందరి పని తీరు బాగా లేదు.. వారు మారాలి..లేకపోతే మార్చేస్తాం..అని టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఆదివారం మంగళగిరిలో టీడీపీ కేంద్ర కార్యాలయంలో టీడీపీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహారశుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్, టీడీపీ కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షుడు పి.తిక్కారెడ్డి, మల్లెల రాజశేఖర్, ఎంపీలు బస్తిపాటి నాగరాజు, బైరెడ్డి శబరి, ఎమ్మెల్యేలు గౌరు చరిత, బొగ్గుల దస్తగిరి, కేఈ శ్యాంబాబు, బీవీ జయనాగేశ్వరరెడ్డి, ఆదోని టీడీపీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే కె.మీనాక్షినాయుడు, ఆలూరు, మంత్రాలయం ఇన్‌చార్జ్‌లు వీరభద్రగౌడ్, ఎన్.రాఘవేంద్రరెడ్డి, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, కేడీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, డీసీఎంసీ చైర్మన్ నాగేశ్వరరావుయాదవ్ సహా వివిధ కార్పొరేషన్ చైర్మన్లు ధర్మవరం సుబ్బారెడ్డి, మాన్వి దేవేంద్రప్ప, కప్పట్రాళ్ల బొజ్జమ్మ ఏపీ శాలివాహన కార్పొరేషన్ మాజీ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు నిత్యం ప్రజల్లో ఉండి, కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలు సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాలన్నారు. జూలై 2 నుంచి చేపట్టే ఇంటింటికి కార్యక్రమం దిగ్విజయం చేస్తూ ప్రజా ప్రతినిధులు ప్రజల మధ్యకు వెళ్లాలని గట్టిగా చెప్పారు. 2029 ఎన్నికలే లక్ష్యంగా ముందుకు వెళ్లాలని దిశానిర్దేశం చేశారు. ఉమ్మడి జిల్లాలో పలువురు ఎమ్మెల్యేల పని తీరు బాగా లేదనే రిపోర్టు వచ్చిందని, వారు తమ పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారు.

అధినేత హెచ్చరికలతోనైనా మారుతారా..?:

ఎంపీలు, ఎమ్మెల్యేల పనితీరుపై టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు వివిధ మార్గాలు ద్వారా నివేదికలు తెప్పించుకున్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేల పనితీరు బాగా లేదంటూ ఫిర్యాదులు వెళ్లినట్లు సమాచారం. ధనాపేక్షతతో ప్రజా సంక్షేమం, అభివృద్ధి పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. కొందరు ఎమ్మెల్యేల స్థానంలో ఇతరులు పెత్తనం చెలాయిస్తూ షాడో ఎమ్మెల్యేలుగా మారారనే ఫిర్యాదులు అధిష్టానానికి వెళ్లాయని సమాచారం. ఎర్రమట్టి, మద్యం, ఉద్యోగుల బదిలీల్లో నాటి వైసీపీ ఎమ్మెల్యేలకు ఏమాత్రం తీసిపోరని, ఇలాగే కొనసాగితే పార్టీకి తీవ్ర నష్టం తప్పదనే సంకేతాలు నిఘా వర్గాలు ప్రభుత్వానికి ఇచ్చినట్లు విశ్వాసనీయంగా తెలుస్తోంది. ఈ నివేదికలు ఆధారంగా పని తీరు బాగా లేకపోయినా, మారకపోయినా గుడ్‌బై చెప్పేస్తానని అధినేత చంద్రబాబు ఘాటుగా హెచ్చరించారు. ఇప్పటికైనా ఉమ్మడి జిల్లాలో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలు మారుతారా..? అంటూ టీడీపీ శ్రేణులే చర్చించుకోవడం కొసమెరుపు.



సమావేశంలో పాల్గొన్న పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్

ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌కు అవార్డు



అవార్డును అందుకుంటున్న ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్

కర్నూలు ఎడ్యుకేషన్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): కర్నూలు బి.క్యాంపు ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్‌కు బెస్ట్ ప్రిన్సిపాల్ ఆఫ్ ది ఇయర్-2025 అవార్డు ప్రదానం చేశారు. ఆదివారం హైదరాబాదులోని సువరం ప్రతాప్‌రెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం సమావేశ హాలులో ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్ అవార్డును అందుకున్నారు. నీతి అయోగ్ ద్వారా అక్రిడిటేషన్, అఫిలియేషన్ పొందిన ఏపి యా వేదిక్ ఇంటర్నేషనల్ కల్చర్, రీ సెర్చ్ స్ఫూర్తి అకాడమీ వారు విద్యా రంగంలో విశిష్ట సేవలు అం దించినందుకు గానూ ఈ అవార్డును ప్రదానం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెన్నారెడ్డి, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు బదిలీ కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్ఈ రామచంద్రారెడ్డి

కర్నూలు న్యూసిటీ, జూన్ 29(ఆంధ్రజ్యోతి): పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి ఇంజనీరింగ్ అసిస్టెంట్ల బదిలీ కౌన్సెలింగ్ ముగిసింది. ఆదివారం జిల్లా పరిషత్ ఆవరణలోని విశ్వేశ్వరయ్య భవన్‌లో జరిగిన కౌన్సెలింగ్ పీఆర్ ఎస్ఈ వి. రామచంద్రారెడ్డి, ఆదోని ఈఈ వెంకటేశ్వర్లు, నంద్యాల ఈఈ రఘురాంరెడ్డి, డీఈఈలు రవీంద్రారెడ్డి, శ్రీనివాసులు నిర్వహించారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు కౌన్సెలింగ్ ద్వారా అడిగిన సచివాలయాలను కేటాయించారు. 5 సంవత్సరాలు పూర్తి చేసుకున్న వారు 477 మంది ఉండగా రిక్వెస్ట్ కింద 25 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఇతర ప్రాంతాల నుంచి చిన్నారులను తీసుకుని తల్లులు కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. జిల్లా పరిషత్ ఆవరణలోని పార్కులో తల్లులు తమ బిడ్డలను ఉయ్యాలలో వేసి సేదతీర్చారు.

వెల్ఫేర్ అసిస్టెంట్లకు..



సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ తులసీదేవి

కర్నూలు ఎడ్యుకేషన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కర్నూలు శివారులోని జి. పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో ఆదివారం వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ల బదిలీ కౌన్సెలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఈ ప్రక్రియ రాత్రి వరకు కొనసాగింది. జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకురాలు తులసిదేవి ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి చింతామణి, ఏఎస్‌డబ్ల్యూవోలు మద్దిలేటి, బాబు, వార్డెన్లు, కార్యాలయ సిబ్బంది కౌన్సెలింగ్‌కు హాజరైన ఉద్యోగుల సర్టిఫికెట్లను పరిశీలించారు. అధిక సంఖ్యలో ఉమ్మడి జిల్లాలోని వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు హాజరు కావడంతో కళాశాల ప్రాంగణం రద్దీగా కనిపించింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. కౌన్సెలింగ్‌కు ఉద్యోగుల మినహా ఇతరులను ఎవరినీ లోపలికి అనుమతించలేదు. సాయంత్రం 7 గంటల వరకు 556 మంది ఉద్యోగుల సర్టిఫికెట్లను పరిశీలించి వారు కోరుకున్న స్థానాలను అలాట్ చేశారు. ఒకే స్టేషన్‌లో ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఉద్యోగులు 570 మంది, ఐదు సంవత్సరాలు పూర్తి కానీ వారు 131 మంది ఉద్యోగులు బదిలీ కౌన్సెలింగ్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. కౌన్సెలింగ్ హాలులో స్క్రీనింగ్‌పై ఖాళీలను డిస్‌ప్లే చేసి ఉద్యోగులకు ఎంపిక ప్రక్రియను కొనసాగించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూవోలు లీలావతి, సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయ ఉద్యోగులు, ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయ ఉద్యోగులు ఉన్నారు.

టీడీపీ కార్యకర్తలపై వైసీపీ నాయకుల దాడి

ఐనేకల్లు గ్రామంలో మొహర్రం వేడుకల వివాదం..



సుంకన్న



లక్ష్మన్న

ఆదోని రూరల్/ ఆస్పరి, జూన్ 29 ఆంధ్రజ్యోతి): ఆస్పరి మండలంలోని ఐనేకల్లు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలపై అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు దాడిచేసి గాయపరిచారు. బాధితుల కథనం మేరకు.. గ్రామంలో పది రోజుల క్రితం నిర్వహించిన ఏరువాక పౌర్ణమి ఉత్సవాల్లో టీడీపీ నాయకులు సుంకన్న ఎద్దులకు టీడీపీ జెండా కట్టారు. దాన్ని మనసులో పెట్టుకున్న వైసీపీ నాయకుడు గోవిందు, అనుచరులు శివ, శేఖర్, లాలూ, ముద్దలయ్య, గోవిందరాజు, నాగరాజు శనివారం సాయంత్రం టీడీపీ కార్యకర్తల ఇంటికి వెళ్లి కత్తులతో దాడి చేశారు. దీంతో సుంకన్న, అతని తమ్ముడు లక్ష్మన్నకు తీవ్ర గాయాలతో రక్తస్రావమైంది. అలాగే బాధితుల బంధువు రాముడుకు కూడా గాయాలయ్యాయి. వీరికి కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ విషయమై ఎస్పీని కలవనున్నట్లు బాధితులు తెలిపారు. ఆస్పరి సీఐ మస్తాన్ వలి మాట్లాడుతూ ఐనేకల్లుకు చెందిన సంజన్న ఫిర్యాదు మేరకు గ్రామానికి చెందిన గోవిందుతోపాటు మరో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

తెలంగాణ పీజీ సెట్‌లో ప్రథమ ర్యాంకు



షేక్ అర్షియా కొనైన్

పాణ్యం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ పీజీసెట్ ఫార్మసీ విభాగంలో శాంతిరాం ఫార్మసీ కళాశాల విద్యార్థిని షేక్ అర్షియా కొనైన్ రాష్ట్ర ప్రథమ ర్యాంకు సాధించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ మధుసూదన్‌శెట్టి తెలిపారు. ఆదివారం ఆయన మట్లాడుతూ తెలంగాణ పీజీసెట్ 2025 పార్మసీ విభాగం పరీక్షా ఫలితాల్లో విద్యార్థిని తెలంగాణ రాష్ట్ర మొదటి ర్యాంకు సాధించిందన్నారు. వంద మార్కులతో రాష్ట్ర ప్రథమ ర్యాంకు సాధించిందన్నారు. కళాశాల చైర్మన్ డాక్టర్ ఎం శాంతిరాముడు, ఎండీ శివరామ్, డైరెక్టర్ డాక్టర్ అశోక్‌కుమార్, అధ్యాపకులు, కళాశాల సిబ్బంది విద్యార్థినిని అభినందించారు.

ఆ ఇద్దరి కోసం

- ఆదుకుంటున్న ఆపన్నహస్తాలు
- శాశ్వత పరిష్కారం దిశగా అధికారుల చర్యలు
- స్వచ్ఛంద సంస్థల హామీ
- వెంటనే ఇంటి నిర్మాణం చేపడుతాం - ఆదోని సబ్ కలెక్టర్, మౌర్య భరద్వాజ్
- విద్యార్థిని ఉన్నత చదువుకు చేయూతనిస్తాం - శామ్యూల్ పాల్, డీఈవో

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



తల్లి, కూతుళ్లతో మాట్లాడుతున్న ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

మంత్రాలయం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని మాధవరం తండాకు చెందిన సుగాలి చిన్న రంగమ్మ, ఆమె కూతురు కీర్తిబాయికి అధికారులు, స్వచ్ఛంద సంస్థల నాయకులు, రాజకీయ నేతలు ఆపన్న హస్తం అందించేందుకు ముందుకు వచ్చారు. ఆదివారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఆ ఇద్దరు.. ఐదేళ్లుగా చెట్టుకిందే నివాసం.. అనే శీర్షికతో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనికి స్పందించిన కలెక్టర్ రంజిత్ బాషా, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, తహసీల్దార్ రమాదేవి, డిప్యూటీ తహసీల్దార్ జీకే గురురాజరావు, ఆర్ఐ జనార్దన్‌రావు గ్రామానికి వెళ్లి వీరి పరిస్థితిని పరిశీలించి తల్లి కూతుళ్లను ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయానికి తీసుకెళ్లారు. వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వారంలో స్వగ్రామంలోనే కొత్త ఇల్లు నిర్మాణ పనులు ప్రారంభిస్తామని సబ్ కలెక్టర్ హామీ ఇచ్చారు. విద్యార్థిని కర్నూలులో చదువుకునేందుకు అయ్యే ఖర్చు భరిస్తామని అన్నారు. డీఈవో శామ్యూల్ పాల్ తండాకు వెళ్లి చెట్టు నీడన వారు ఉంటున్న ప్రాంతాన్ని పరిశీలించి వారి సమస్యలను గ్రామస్థులను, బంధువులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రిటైర్డు ఐజీ మహ్మద్ ఇక్బాల్ పంపిన రూ.25వేల నగదును జన్‌జీవన్ జ్యోతి అధ్యక్షుడు నవాజ్, మదర్ థెరిస్సా సంస్థ అధ్యక్షుడు నజీర్, వీరసాబ్, ఈరన్న ఇచ్చిన రూ.25వేల నగదును డీఈవో, ఎంఈవో షైనుద్దీన్‌ల చేతుల మీదుగా అందజేశారు. అదే విధంగా మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి వీరి కుటుంబాన్ని పరామర్శించి వీరి కుటుంబానికి అన్ని సౌకర్యాలు కల్పించి కీర్తిబాయి చదువుకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. నంద్యాల పంచాయతీరాజ్ డీఈ నాగరాజు రూ.10వేలు, రచ్చుమర్రికి చెందిన వీబీకే పద్మావతి రూ.3వేలు ఇచ్చారు. ఆర్‌డీటీ సంస్థ ఆ కుటుంబానికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. గ్రామంలోని ఎంప్లాయిస్ అసోసియేషన్ దాదాపు రూ.70వేల ఖర్చుతో తాత్కాలిక షెడ్డును ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. మంత్రాలయం సీఐ రామాంజులు, ఎస్ఐలు విజయకుమార్, శివాంజల్, ఆదోని ఎస్‌బీ ఎస్ఐ వేణుగోపాల్, మాధవరం మారుతి ట్రేడర్స్ గుర్మింటి భీమిరెడ్డి, స్థానికుడు అమ్రేష్ నాయక్, రంగనాయకులు చిన్న రంగమ్మ కుటుంబానికి అండగా ఉండి ఆదుకుంటామని తెలిపారు. మంత్రాలయం చెందిన బొంబాయి శివ వీరికి అవసరమైన నగదును అందిస్తామని ముందుకు వచ్చారు. వారికి నిత్యావసర సరుకులు, దుప్పట్లు, దుస్తులు ఏర్పాటు చేస్తామని పలువురు దాతలు హామీ ఇచ్చారు. గిరిజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుగాలి రాజు ఉన్నతాధికారులతో మాట్లాడి వారికి శాశ్వత పరిష్కారాన్ని చూపుతామని తెలిపారు. ఆంధ్రజ్యోతిలో ఆ ఇద్దరు అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి వచ్చిన స్పందనకు ఆ తల్లి కూతుళ్లు సంతోషం వ్యక్తం చేశారు.



నగదు అందజేస్తున్న డీఈవో

నేడు గ్రేడ్-3 ఏఎన్‌ఎంలకు బదిలీ కౌన్సెలింగ్

కర్నూలు హాస్పిటల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో పని చేస్తున్న ఏఎన్ఎం గ్రేడ్-3, వార్డు హెల్త్ సెక్రటరీలకు సోమవారం బదిలీల కౌన్సెలింగ్ కర్నూలు మెడికల్ కాలేజీ న్యూ ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారులు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లకు ఆదేశాలు జారీ చేశారు. సోమవారం ఉదయం ఏఎన్ఎం గ్రేడ్-3 అభ్యర్థులు ఉదయం 7 గంటలలోపు కౌన్సెలింగ్‌కు తప్పక హాజరు కావాలని, ఆలస్యంగా వచ్చిన వారిని, గైర్హాజర్‌గానే పరిగణిస్తామన్నారు. ఐదేళ్ల పూర్తయి లాంగ్ స్టాండింగ్‌లో 754 మంది ఉన్నారు. సోమవారం ఉదయం, మధ్యాహ్నం సెషన్‌లో కౌన్సెలింగ్ జరుగుతుంది.

ఆందోళనలో ఉద్యోగులు

ఏఎన్ఎం గ్రేడ్-3ల కౌన్సెలింగ్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు నిర్లక్ష్యంగా బదిలీల ప్రక్రియ దైవాదీనంగా మారింది. ఓ పక్క ఆదివారం పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లకు సోమవారం ఉదయం 7 గంటలకు బదిలీల కౌన్సెలింగ్ ఉంటుందని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. అన్ని జిల్లాలో ముదుగా సీనియారిటీ జాబితాను విడుదల చేసిన కర్నూలు జిల్లాలో మాత్రం ఆదివారం రాత్రి 9 గంటలకు సీనియారిటీ విడుదల చేయడంతో ఉద్యోగులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. ఆదివారం జరగాల్సిన బదిలీలు వాయిదా వేస్తున్నట్లు ఉద్యోగులకు మెసేజ్ చేసిన అధికారులు సీనియారిటీ జాబితా సోమవారం రాత్రి విడుదల చేస్తే కౌన్సిలింగ్‌లో మొదట ఉన్న ఏఎన్ఎం గ్రేడ్-3ల పరిస్థితి ఏమిటో అర్థం కావడం లేదు. శ్రీశైలం, హాలహర్వి, హొళగుంద, కోసిగి, కౌతాళం, చాగలమర్రి, ప్రాంతాల నుంచి సోమవారం ఉదయం కౌన్సెలింగ్‌కు చేరుకోవాలంటే ఆదివారం రాత్రి చేరుకోవాల్సి ఉంటుంది. అయితే 9 గంటల సమయంలో సీనియారిటీ జాబితా ఇస్తే దూర ప్రాంతాల నుంచి ఎప్పుడు చేరుకోవాలని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కర్నూలు డీఎంహెచ్‌వోను వివరణ కోరేందుకు ప్రయత్నించగా.. డీఎంహెచ్‌వో ఫోన్‌లో అందుబాటులోకి రాలేదు.

పౌరాణిక నాటకాలకు ఆదరణ పెరగాలి

- పారిశ్రామికవేత్త బీవీ రెడ్డి
- అలరించిన నాటిక ప్రదర్శనలు

కర్నూలు కల్చరల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఇతర భాషల్లో లేని తెలుగు పౌరాణిక పద్య నాటకాలకు ఆదరణ పెరగాల్సిన అవసరం ఉందని పారిశ్రామికవేత్త, కర్నూలు పిరమిడ్ స్పిరిచ్యువల్ సెంటర్ వ్యవస్థాపకుడు బీవీ రెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో, హైదరాబాదు విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ సంస్థ వారి 'స్వేచ్ఛ' సాంఘిక నాటిక ప్రదర్శన ప్రేక్షకుల మన్నన పొందింది. ఈ ప్రదర్శనకు ముందు బీవీ రెడ్డి మాట్లాడుతూ కళల కాణాచిగా ఖ్యాతి పొందిన కర్నూలు జిల్లాలో పౌరాణిక పద్య నాటకాలకు పూర్వ వైభవం రావాలని ఆకాంక్షించారు. జి.పుల్లయ్య మాట్లాడుతూ పౌరాణిక నాటక ప్రదర్శనలకు కొత్తతరం నటులు, యువత ముందుకు రావాలని సూచించారు. సభాధ్యక్షత వహించిన కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ కళాక్షేత్రం గౌరవ చైర్మన్, మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ సూచనల మేరకు ప్రతి ఆదివారం ఒక సాంస్కృతిక కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. అనంతరం ప్రదర్శించిన స్వేచ్ఛ నాటికలో మహేశ్వరిగా సురభి లలిత, శ్వేతగా మంజు భార్గవి, అవినాష్‌గా గోవర్ధన్ రెడ్డి, ఆనందమూర్తిగా సతీష్ నటించగా, సీనియర్ రంగస్థల నటుడు బీఎం రెడ్డి దర్శకత్వం వహించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం జాతీయ కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు, సీనియర్ రంగస్థల నటుడు పి. దస్తగిరి, కార్యక్రమ కన్వీనర్ పి.రాజారత్నం, కళాక్షేత్రం కార్యదర్శి మహమ్మద్ మియా, ఆంధ్రజ్యోతి యూనిట్ మేనేజర్ ఆకుల లక్ష్మణ్, బ్యూరో ఇన్‌చార్జి గోరంట్ల కొండప్ప తదితరులు పాల్గొన్నారు.



నాటక ప్రదర్శనలను ప్రారంభిస్తున్న దృశ్యం

అలరించిన శ్రీకృష్ణ రాయబారం

కర్నూలు టీజీవీ కళాక్షేత్రం కళాకారులతో ఆదివారం రాత్రి ప్రదర్శించిన శ్రీకృష్ణ రాయబారం (పడకసీను) పౌరాణిక పద్య నాటకం ఆద్యంతం ప్రేక్షకులను అలరింపజేసింది. పత్తి ఓబులయ్య దర్శకత్వంలో శ్రీకృష్ణుడిగా భాస్కర్ యాదవ్, అర్జునుడిగా కేవీ రమణ, దుర్యోధనుడిగా చల్లా నవీన్‌కుమార్ చౌదరి నటించారు. సంగీతం బలరాం సమకూర్చారు.



కళాకారులను సన్మానిస్తున్న బీవీ రెడ్డి

యువకుడి దారుణ హత్య



వినయ్‌కుమార్ (ఫైల్)

నంద్యాల టౌన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా కేంద్రం శివారులోని ఎల్‌కేఆర్ ఫంక్షన్ హాల్ సమీపంలోని బావి వద్ద ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. నంద్యాల తాలుకా సీఐ ఈశ్వరయ్య తెలిపిన వివరాలివీ.. నంద్యాల పట్టణం దేవనగర్‌కు చెందిన వినయ్‌కుమార్ అలియాస్ మోటు(24) ఆదివారం ఉదయం 11గంటల సమయంలో ఇద్దరు యువకులతో కలిసి ఎల్‌కేఆర్ సమీపంలోని బావి వద్దకు చేరుకున్నాడు. అయితే వీరి మధ్య ఘర్షణ జరిగింది. వినయ్‌కుమార్‌ను కత్తితో దాడిచేసి బండరాళ్లతో మోది హత్య చేశారు. మాదకద్రవ్యాల అమ్మకం ద్వారా వచ్చిన డబ్బు విషయంలో ఘర్షణ పడి హత్య చేసి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. వినయ్‌కుమార్‌తో పాటు వెళ్లిన ఆ ఇద్దరు ఎవరు అనేది విచారిస్తున్నామని, యువకుడి తండ్రి సత్యబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. ఈ యువకుడిపై గతంలో ఒక దొంగతనం, రెండు గంజాయి కేసుల్లో నిందితుడిగా ఉన్నారని, ఇటీవలే జైలు నుంచి బయటకు వచ్చినట్లు పోలీసులు తెలిపారు.

మహిళా పోలీసు మృతి



దివ్య (ఫైల్)

ఆదోని అగ్రికల్చర్ జూన్ 29 (ఆంధ్ర జ్యోతి): పట్టణంలోని 34వార్డు సచివాలయం మహిళా పోలీస్ దివ్య(26) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందింది. వివరాల మేరకు.. 14రోజులు క్రితం ఆడ శిశువుకు జన్మనిచ్చింది. అయితే రెండు రోజుల నుంచి అస్వస్థతకు గురికావడంతో బంధువులు పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు కర్నూలుకి రెఫర్ చేయడంతో అంబులెన్స్‌లో కర్నూలుకు తీసుకెళ్లేలోపు మార్గమధ్యంలో మృతి చెందింది. ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

యువతి ఆత్మహత్య

ఆదోని అగ్రికల్చర్ జూన్ 29 (ఆంధ్ర జ్యోతి): తల్లి మందలించిందని ఓ యువతి ఆదివారం ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. పట్టణంలోని అమరావతి నగర్‌కు చెందిన శంకరమ్మ, చిన్న ఉసేని దంపతులు కుట్టుమిషన్ ద్వారా జీవనం సాగిస్తున్నారు. వారి చివరి కుమార్తె సాయిలక్ష్మి(20)ని కుట్టుమిషన్ నేర్చుకోవాల్సిందిగా తల్లి సూచించింది. అయితే తనకు కుట్టుమిషన్ నేర్చుకోవడం ఇష్టం లేదని కూతురు చెప్పడంతో తల్లి మందలించింది. మనస్తాపం చెందిన సాయిలక్ష్మి ఇంట్లోకి వెళ్లి ఉరేసుకుంది. తల్లిదండ్రులు గమనించేలోపు మృతి చెంది ఉంది. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలం


మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని సీపీఎం జిల్లా నాయకులు ఏసురత్నం, పట్టణ కార్యదర్శి రణధీర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఆత్మకూరు పట్టణంలోని సుదర్శన వర్మ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయడంలో జాప్యం వహించడం సరికాదన్నారు. అదేవిధంగా వైసీపీ హయంలో స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించి కూటమి ప్రభుత్వ పెద్దలు నేడు స్మార్ట్ విద్యుత్ మీటర్ల ఏర్పాటుకు పూనుకోవడం విడ్డూరంగా ఉందని అన్నారు. కాగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాలు చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీరన్న, రామ్‌నాయక్, సురేంద్ర, నాగేశ్వరరావు, భాస్కర్, మంజుల తదితరులు ఉన్నారు.

నంద్యాలలో సీనియర్ బేస్‌బాల్ జట్ల ఎంపిక


జిల్లా స్థాయి బేస్‌బాల్ పోటీలను ప్రారంభిస్తున్న సుధాకర్

నంద్యాల హాస్పిటల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణంలోని రామకృష్ణా పీజీ కళాశాల మైదానంలో ఉమ్మడి కర్నూలు, నంద్యాల బేస్‌బాల్ జిల్లా మహిళా, పురుషుల జట్లు ఎంపిక పోటీలు జరిగాయి. నంద్యాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుబ్బయ్య, రమణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలకు ముఖ్య అతిధులుగా ఏపీ స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు నిమ్మకాయల సుధాకర్, డాక్టర్ సుబ్బారావు, ఏపీఎస్‌ఏడీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఏ పిచ్చిరెడ్డిలు పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లాల నుంచి సుమారు 200 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఎంపికైన జిల్లా జట్లు జులై 13,14,15 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. క్రీడాకారులకు డాక్టర్ సుబ్బారావు భోజన వసతి కల్పించారు. అనంతరం జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో బంగారు, వెండి పతకాలు సాధించిన క్రీడాకారులను సత్కరించారు. కార్యక్రమంలో ఎస్జీఎఫ్ సహాయ కార్యదర్శి విశ్వనాథ్, వ్యాయామ ఉపాధ్యాయులు దేవేంద్ర, నరసింహ, దాదాపీర్, సురేష్‌నాయుడు, షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ విద్య అవసరం


విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి

నంద్యాల రూరల్, జూన్ 29(ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరికీ విద్య అవసరమని నంద్యాల మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి అన్నారు. ఆదివారం నంద్యాల పట్టణంలోని రాజారెడ్డి ఫంక్షన్‌హాల్‌లో దూదేకుల-నూర్‌బాషా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భారతీయులు చక్కటి విద్యను అభ్యసించి ప్రపంచంలోని పలు దేశాల్లో సీఈవోలతోపాటు మరిన్ని ఉన్నత పదవుల్లో రాణిస్తున్నట్లు తెలిపారు. ప్రతి విద్యార్థి చక్కటి అభ్యసన సామర్థ్యాలు పెంచుకోవాలన్నారు. క్రమశిక్షణ కలిగిన జీవితం వల్ల వ్యక్తి మానసిక, ఉద్యోగ, ఉన్నతికి బాటలు వేయవచ్చని అన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేశ్ ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నారని అన్నారు. నంద్యాలలో జరిగిన ఉప ఎన్నికల్లో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థలం కేటాయించడం జరిగిందని.. కొందరు నాయకులు స్థలాలు మార్చడంతో నిర్మాణ పనులు జరగలేదన్నారు.

జాతీయ ర్యాంకింగ్ బాడ్మింటన్ టోర్నీలో జశ్వంత్‌కు బంగారు పతకం


బంగారు పతకం సాధించిన జశ్వంత్

నంద్యాల హాస్పిటల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): నంద్యాల నందిపైపుల బాడ్మింటన్ అకాడమీకి చెందిన క్రీడాకారుడు మహంకాళీ జశ్వంత్‌కు జాతీయ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ పోటీల్లో డబుల్స్ విభాగంలో బంగారు పతకం సాధించాడు. సింగిల్స్‌లో బ్రాంజ్ మెడల్ దక్కించుకున్నాడు. ఈనెల 23 నుంచి 28 వరకు గోవాలో జరిగిన అండర్ 13 యోనెట్ సన్‌రైజ్ ఆలిండియా సబ్‌జూనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో జశ్వంత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన జశ్వంత్‌ను జిల్లా బాడ్మింటన్ కార్యదర్శి వంశీధర్, బ్యాడ్మింటన్ కోచ్ నాగార్జునలు ప్రత్యేకంగా అభినందించారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ఆత్మకూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ రమేష్‌బాబు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతినెల జరిగే సాధారణ మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో భాగంగా శుక్రవారం ఉదయం 11గంటలకు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ మారూఫ్ ఆసియా అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి వైస్‌చైర్మన్లు, కౌన్సిలర్లు, కోఆప్షన్, ఎక్స్‌అఫిషియో సభ్యులు హాజరు కావాలని కోరారు. ఈక్రమంలోనే పలు తీర్మానాలను కౌన్సిల్ దృష్టికి తీసుకురానున్నట్లు చెప్పారు.

నేడు జూపల్లె ఎల్లారెడ్డి సంస్మరణ సభ


ఎల్లారెడ్డి (ఫైల్)

కర్నూలు హాస్పిటల్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎన్ఆర్ పేటలోని రేణుకా మల్టిస్పెషాలిటీ హాస్పిటల్‌లో సోమవారం మధ్యాహ్నం 12గంటలకు రిటైర్డు హెడ్‌మాస్టర్ (మిడ్తూరు) జూపల్లె ఎల్లారెడ్డి సంస్మరణ సభ నిర్వహిస్తున్నట్లు కుమారుడు డాక్టర్ జే.రఘునాథరెడ్డి, కోడలు డాక్టర్ రాజేశ్వరి తెలిపారు. ఎల్లారెడ్డి ఈనెల 20న కన్నుమూశారన్నారు. ఈ సభకు బంధువులు, మిత్రులు హాజరు కావాలని కోరారు.

అధికారుల నిర్లక్ష్యం.. ప్రజలకు శాపం

- నిధులు మంజూరైనా పనులు ప్రారంభం కానీ వైనం
- ఇబ్బంది పడుతున్న ప్రజలు, వాహనదారులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



గుంతలు పడ్డ రహదారి

కొత్తపల్లి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): దేవుడు వరమిచ్చినా.. పూజారీ వరమివ్వడు అన్న చందంగా ఆత్మకూరు- దుద్యాల రోడ్డు పరిస్థితి నెలకొంది. ఆత్మకూరు నుంచి వయా దుద్యాల మీదుగా కొక్కెరంచ వరకు సుమారు 13 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు నిర్మాణం కోసం ప్రభుత్వం నాబార్డు-30 పథకం కింద సుమారు రూ.2 కోట్ల నిధులు మంజూరు చేసి నెలలు గడుస్తున్నా పనులు ప్రారంభించలేదు. దీనికి సంబంధించిన టెండర్లు సైతం పూర్తయినప్పటికీ అధికారుల నిర్లక్ష్యమో.. కాంట్రాక్టర్ల అలసత్వమో తెలియదు కానీ పనులైతే ప్రారంభం కాలేదు. ఆత్మకూరు నుంచి దుద్యాల వరకు రహదారి పూర్తిగా గుంతలమయమైంది. దీంతో ద్విచక్రవాహనదారులు, ఆటోలు ప్రమాదవశాత్తు రోజు అదుపు తప్పి కింద పడి ప్రజలు గాయాల పాలవుతున్నారు. నిత్యం ఈ రోడ్డు గూండా ఆత్మకూరు పట్టణానికి దుద్యాల, కొక్కెరంచ, ఎదురుపాడు, కొత్తమాడుగుల, నాగంపల్లి, జడ్‌వారిపల్లి, ఇస్కాల, చిలిమిల్ల, లింగాల గ్రామాల ప్రజలు వివిధ పనుల నిమిత్తం ఆత్మకూరు పట్టణంతో పాటు ఇతర ప్రాంతాలకు వెళ్తుంటారు. ఈ విషయంపై పీఐయు ఏఈ కానాల వెంకటరమణను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. సంబంధిత కాంట్రాక్టరుతో చర్చించి పదిరోజుల్లో పనులు ప్రారంభిస్తామని చెప్పడం గమనార్హం.

పనులు ప్రారంభించాలి..



అధికారులు అలసత్వం వీడి ఆత్మకూరు నుంచి దుద్యాల వయా కొక్కెరంచ బీటీ రోడ్డు నిర్మాణ పనులు తక్షణమే చేపట్టాలి. రోడ్డు పూర్తిగా దెబ్బ తినడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా ఉందన్నారు. నిధులు మంజూరై నెలలు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. వీటిపై స్థానిక ఎమ్మెల్యే స్పందించి ఇక్కడి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తక్షణమే రహదారి పనులు చేపట్టేలా అధికారులను ఆదేశించాలి.

- కె.సుధాకర్ రెడ్డి, వైసీపీ మండల కన్వీనర్

పోతిరెడ్డిపాడు ద్వారా నీరు విడుదల చేయండి

- లేదంటే ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో గేట్లు ఎత్తుతాం
- ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్



మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్

నందికొట్కూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): జూలై 2న పోతిరెడ్డిపాడు గేట్ల ద్వారా సాగునీటిని విడుదల చేయకపోతే రైతు సంఘం ఆధ్వర్యంలో గేట్లు ఎత్తుతామని ఆ సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి రాజశేఖర్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆదివారం నందికొట్కూరు సీపీఎం కార్యాలయంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగేశ్వరరావు, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేశ్వరరావు, సీఐటీయూ నాయకులు ఉస్మాన్ బాషాతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. రాజశేఖర్ మాట్లాడుతూ ఈ ఏడాది కర్ణాటక, మహారాష్ట్రలలో ముందస్తు వర్షాల కారణంగా శ్రీశైలం ప్రాజెక్టుకు 865 అడుగుల మేర నీరు చేరుకుందన్నారు. ఖరీఫ్ ప్రారంభమై నెల రోజులు అవుతున్నా వర్షాలు లేక పోవడంతో రైతాంగం వర్షం కోసం ఎదురుచూస్తోందన్నారు. కనీసం సాగునీటి కాలువలకైనా పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా నీటిని విడుదల చేసి రాయలసీమ రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. జూలై 2వ తేదీలోగా ప్రభుత్వం పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి నీటిని విడుదల చేయాలని లేని పక్షంలో జూలై 3వ తేదీ నాటికి కేసీ కెనాల్‌కు, పోతిరెడ్డిపాడు గేట్లు ఎత్తడం ద్వారా వెలుగోడు రిజర్వాయర్, ఎస్ఆర్‌బీసీ లింక్ ఛానల్‌లకు నీళ్ల ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో తామే పోతిరెడ్డిపాడు గేట్లను ఎత్తుతామని ఆయన హెచ్చరించారు.

ముమ్మరంగా పోలీసుల కార్డన్ సెర్చ్


సిద్ధాపురంలో కార్డన్ సెర్చ్ తనిఖీలు చేస్తున్న పోలీసులు

ఆత్మకూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా ఆదేశాల మేరకు ఆత్మకూరు మండలంలోని సిద్దాపురం గ్రామంలో ఆదివారం పోలీసులు కార్డెన్ సెర్చ్ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆత్మకూరు అర్బన్ సీఐ రాము మాట్లాడుతూ.. సిద్దాపురం గ్రామంలోని అనుమానితులు, నేరచరిత్ర కలిగిన వారి నివాసాల్లో తనిఖీలు చేయగా సరైన ధృవీకరణ పత్రాలు లేని 20 బైకులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిలో కొందరు ధృవీకరణ పత్రాలు చూపించగా బైకులను వెనక్కి ఇచ్చినట్లు చెప్పారు. మిగతా వారికి జరిమానా విధించినట్లు వెల్లడించారు. కాగా సమాజంలో జరుగుతున్న నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించే ప్రసక్తే ఉండదని స్పష్టం చేశారు.

12 బైకులు స్వాధీనం


మద్యం సీసాలను స్వాధీనం చేసుకుంటున్న ఎస్ఐ నాగార్జున్‌రెడ్డి

గడివేముల: మండలంలో ఫ్యాక్షన్ గ్రామమైన పెసరవాయిలో పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఆదివారం వేకువ జాము నుంచి నిర్వహించిన ఈ కార్యక్రమంలో ధృవీకరణ పత్రాలు లేని 12 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు పాణ్యం సీఐ కిరన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. అనుమానిత, రౌడీషీటర్ల ఇళ్లలో తనిఖీలు నిర్వహించారు. శ్రీనివాసులు దుకాణంలో 15 మద్యం బాటిళ్లను ఎస్ఐ నాగార్జున్‌రెడ్డి పట్టుకొని అతడిపై కేసు నమోదు చేశారు. అనంతరం ప్రజలకు సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. గ్రామంలో అనుమానిత వ్యక్తులు సంచరిస్తే తమ దృష్టికి తీసుకొని రావాలని అన్నారు. యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని అన్నారు. సాయంత్రం ఎస్ఐ నాగార్జున్‌రెడ్డి పోలీసు స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

దేశ నిర్మాణంలో ఆర్ఎస్ఎస్‌ది కీలక పాత్ర

- ప్రముఖ వైద్యుడు డాక్టర్ రంగశాయి


మాట్లాడుతున్న ప్రముఖ వైద్యుడు డాక్టర్ రంగశాయి

ఆత్మకూరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): దేశ నిర్మాణంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ఎంతో కీలక పాత్ర పోషించినట్లు సీనియర్ స్వయం సేవక్, ప్రముఖ వైద్యులు డాక్టర్ రంగశాయి పేర్కొన్నారు. ఆదివారం ఆత్మకూరులోని జీ.పుల్లారెడ్డి హైస్కూల్‌లో గురుపూజోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్ఎస్ఎస్ నిర్వహిస్తున్న శాఖలో దేశభక్తితో పాటు వ్యక్తిత్వ నిర్మాణాన్ని తీర్చిదిద్దనున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగానే టీ అమ్ముకునే నరేంద్ర మోదీ వ్యక్తి ప్రధాని స్థాయికి చేరినట్లు గుర్తుచేశారు. అదే క్రమంలో 24 మంది ముఖ్యమంత్రులుగా కూడా బాధ్యతలు చేపట్టారని వివరించారు. సంఘం మనకు ఏమి ఇచ్చిందన్న బావనతో కాకుండా సంఘానికి మనం ఏమి చేశామన్న ఆలోచనలతో ముందుకెళ్లినప్పుడే దేశాభివృద్ధి మెరుగుపడుతుందన్నారు. ఆర్ఎస్ఎస్ నేర్పిన క్రమశిక్షణతోనే తాను డాక్టర్‌గా ఎదిగానని స్పష్టం చేశారు. అనంతరం ఆర్ఎస్ఎస్ నంద్యాల జిల్లా ప్రచారక్ రాము మాట్లాడుతూ.. 1925 సంవత్సరంలో విజయదశమి రోజున ఆవిర్భవించిన ఆర్ఎస్ఎస్ వందేళ్లను పూర్తి చేసుకుని శతాబ్ది ఉత్సవాలకు సిద్ధమైనట్లు తెలిపారు. ఈ ఉత్సవాలను ఖండ, గ్రామీణ స్థాయిలో ఘనంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా గురుపూజోత్సవ వేడుక ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఖండ కార్యవాహ చిలుకల వాసుదేవరెడ్డి ఉన్నారు.

క్రీడలకు దూరమవుతున్న విద్యార్థులు

- వ్యాయామ ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీలు



దుద్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

కొత్తపల్లి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఐదు జిల్లా పరిషత్ హైస్కూళ్లలో వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో ఆయా పాఠశాలల విద్యార్థులు క్రీడలకు దూరమవుతున్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా కొత్తపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్‌లో పీఈటీగా విధులు నిర్వహిస్తున్న మురళీ నాయక్ కురుకుంద హైస్కూల్‌కు బదిలీపై వెళ్లారు. అలాగే దుద్యాల హై స్కూల్ పీఈటీ విధులుగా నిర్వహిస్తున్న చంద్రశేఖర్ వడ్లరామాపురం హైస్కూల్‌కు బదిలీపై వెళ్లారు. ఇదిలా ఉంటే శివపురం హైస్కూల్ ఏర్పడి రెండు సంవత్సరాలైనా అప్పటి నుంచి నేటి వరకు పీఈటీ పోస్టు ఖాళీగా ఉంది. అలాగే ముసలిమడుగు, గోకవరం జిల్లా పరిషత్ హై స్కూల్‌లో గత రెండేళ్లక్రితమే ఇద్దరు ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లినా నేటికి కూడా ఆ పోస్టులు భర్తీ చేయలేదు. దీంతో ఈ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు క్రీడలకు దూరమవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వ్యాయామ ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయాలని విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

శ్రీశైలంలో స్వామి, అమ్మవార్లకు పల్లకీ సేవ


పల్లకీ సేవలో స్వామి, అమ్మవారు

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం భ్రమరాంబికా మల్లికార్జునస్వామి ఆలయంలో స్వామి అమ్మవార్లకు పల్లకీ సేవా కార్యక్రమాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. లోక కళ్యాణార్థం ప్రతి ఆదివారం నిర్వహించే సేవల్లో భాగంగా అమ్మవారి ఆలయ ఆశీర్వచన మండపంలో అర్చకులు స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు పల్లకీ సేవను శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకీ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

శ్రీశైలంలో అన్నప్రసాద వితరణకు విరాళం


అన్నప్రసాద వితరణకు విరాళం అందజేస్తున్న భక్తులు

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం భ్రమరాంబికా మల్లికార్జునస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న శాశ్వత అన్నప్రసాద వితరణకు దాతలు రూ.1.01.116 విరాళంగా అందజేశారు. విజయవాడకు చెందిన యుద్ధనపూడి మాధురీజ్యోత్స్న అన్నప్రసాద వితరణకు రూ.1,01,116ల విరాళాన్ని ఆలయ పర్యవేక్షకురాలు దేవికకు అందజేశారు. దాతకు రశీదు, ప్రసాదాలు, శేషవస్త్రం అందజేశారు.

హామీలను అమలు చేయాలి



మాట్లాడుతున్న సీపీఐ పార్టీ మండల కార్యదర్శి మజీద్

పగిడ్యాల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని సీపీఐ పార్టీ మండల కార్యదర్శి అబ్దుల్ మజీద్ డిమాండ్ చేశారు. ఆదివారం పగిడ్యాల గ్రామంలో మండల స్థాయి కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల సమస్యలు పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వ చర్యలు తీసుకోవాలన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక నిధులు విడుదల చేయాలని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు షాలుమియ్య, షబ్బీర్ ఖాన్, రామలింగం తదితరులు ఉన్నారు.

హెల్మెట్ తప్పనిసరి


పాములపాడులో వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ

పాములపాడు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలను నడపాలని, లేదంటే జరిమానాలు తప్పవని ఎస్ఐ సురేష్‌బాబు వాహనదారులను హెచ్చరించారు. ఆదివారం పాములపాడులో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ వాహనదారులు రహదారి సూత్రాలను పాటించాలని, కార్లు నడిపేవారు సీటుబెల్టు పెట్టుకోవాలని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలను నడపరాదని తెలిపారు. మైనర్లకు వాహనాలు నడిపితే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

మొక్కజొన్న పంటల పరిశీలన


మొక్కజొన్న పంటలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి

పాములపాడు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో రైతులు సాగుచేసిన మొక్కజొన్న పంటలను నంద్యాల జిల్లా వ్యవసాయశాఖ అధికారి వెంకటేశ్వరరావు పరిశీలించారు. వర్షాలు సకాలంలో కురవకపోవడంతో పంటలు ఎండి పోతున్నాయని, దీంతో పంటను దున్ని వేయాల్సిన పిరిస్థితి నెలకొందని రైతులు ఏడీవోకు తెలిపారు. పాములపాడు గ్రామ శివార్లలోని మొక్కజొన్న పంటను రైతులతో కలసి మొక్కజొన్నను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ న్యానో యూరియా రెండు ఎంఎల్, పొటాషియం నైట్రేట్ లాంటివి పిచికారి చేస్తే పంటకు పెద్దగా నష్టం వాటిల్లదని తెలిపారు. మొక్కలకు న్యాని యూరియా డెమో చేయించారు. రైతులకు పలుసూచనలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక మండల వ్యవసాయశాఖ అధికారి మహేశ్‌రెడ్డి పాల్గొన్నారు

2న అలోకనమ్ - సాహిత్య విమర్శ గ్రంథం ఆవిష్కరణ

పాణ్యం, జూన్29 (ఆంధ్రజ్యోతి) : సాహితీ వారోత్సవాల్లో భాగంగా జూలై 2వతేదీన అలోకనమ్ - సాహిత్య విమర్శ గ్రంథం ఆవిష్కరణ జరుగుతుందని విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ కల్లూరి ఆనందరావు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ జూలై 1 నుంచి 7 వతేదీ వరకు హైదరాబాద్ త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో కళాసుబ్బారావు కళా వేదికలో నిర్వహించే సాహితీ వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా 2వతేదీన కల్లూరి ఆనందరావు రచించిన అలోకనమ్ - సాహిత్య విమర్శ గ్రంథాన్ని మాజీ వీసీ, పద్మావతి మహిళా యూనివర్శిటీ అధ్యాపకుడు డాక్టర్ కొలకలూరి ఇనాక్ చేతుల మీదుగా ఆవిష్కరిస్తున్నట్లు తెలిపారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

తక్షణమే మరమ్మతులు చేపట్టండి

● మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్



స్టేడియాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

డోన్ టౌన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బుగ్గన శేషారెడ్డి మెమోరియల్ స్టేడియానికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ సూచించారు. ఆదివారం స్టేడియాన్ని అధికారులతో కలిసి చైర్మన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షానికి స్టేడియంలోని సైడ్‌వాల్ లీకేజీ గుర్తించి షటిల్ క్రీడాకారులు తమ దృష్టికి తీసుకవచ్చారన్నారు. వెంటనే మరమ్మతులు చేయాలని ఆదేశించారు. ఆయన వెంట మున్సిపల్ ఏఈ సురేష్, కౌన్సిలర్ నాగేంద్ర, స్టేడియం సభ్యులు వెంకట్రావు తదితరులున్నారు.

జాతీయ స్థాయి కరాటే పోటీల్లో రాణించాలి



కరాటే క్రీడాకారులను అభినందిస్తున్న బీసీ రాజారెడ్డి

బనగానపల్లె, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి కరాటే పోటీల్లో రాణించాలని బనగానపల్లె మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి ఆకాంక్షించారు. పట్టణంలో సమ్మర్ కరాటే క్యాంపు పూర్తి చేసుకున్న సందర్భంగా కరాటే క్రీడాకారులకు సర్టిఫికెట్లు ఆదివారం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కరాటే క్రీడాకారులకు తనవంతు సహకారం అందిస్తామని తెలిపారు. తల్లిదండ్రులు విద్యార్థులకు చిన్నతనం నుంచే క్రీడలు, ఆటలు, కరాటే నేర్పించాలన్నారు. కరాటే మాస్టర్లు బాష, ఫిదా, ఫిరోజ్, జిహోలును రాజారెడ్డి అభినందించారు.

కరాటే విద్యార్థులను అభినందించిన బీసీ ఇందిరమ్మ

పట్టణంలోని ఉన్నతపాఠశాలలో సమ్మర్ కరాటే శిక్షణా తరగతుల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులను ఆదివారం టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ అభినందించారు. విద్యార్థులకు బీసీ ఇందిరమ్మ సర్టిఫికెట్లు, స్టీల్ బాటిళ్లు, బ్యాగులు పంపిణీ చేశారు.

శాకంబరి అలంకారంలో గంగా భవాని

చాగలమర్రి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని చెరువుకట్ట వద్ద వెలసిన గంగాభవాని అమ్మవారు ఆదివారం శాకంబరి అలంకారంలో కొలువుదీరారు. ఆషాఢమాసం సందర్భంగా మహిళలు కూరగాయలు, పండ్లు, పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. వరుణ దేవుడు కరుణించాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అలాగే గ్రామదేవత చాగలమ్మ, గంగమ్మ, పెద్దమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

ఇంటిస్థలాలకు దరఖాస్తు చేసుకోవాలి

కోవెలకుంట్ల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం హౌసింగ్ ఫర్ ఆల్ అనే పథకం ప్రవేశ పెట్టిందని, అర్హులైన వారు ఇంటి స్థలాల కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దారు పవన్‌కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి అర్హులను ఎంపిక చేస్తామన్నారు. పేదలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

అడవి పంది కళేబరం స్వాధీనం

చాగలమర్రి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేపీ తండా గ్రామంలో ఆదివారం అడవిపంది కళేబరం పట్టుబడింది. గ్రామానికి చెందిన మూడే బాలునాయక్ అనే వ్యక్తి నుంచి అడవి పంది కళేబరం, మూడు కత్తులు స్వాధీనం చేసుకున్నామని అటవీశాఖ ఎఫ్‌వో రామకృష్ణ తెలిపారు. కళేబరాన్ని చాగలమర్రి పశువైద్యాధికారితో పోస్టుమార్టం చేయించామని అన్నారు. కార్యక్రమంలో అటవీ సిబ్బంది సుభాష్, మదన్‌గోపాల్, ప్రొటెక్షన్ వాచర్లు ఉన్నారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన

సంజామల, జూన్ 29(ఆంధ్రజ్యోతి): మంగపల్లెలోని పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి ప్రజా వైద్యశాలలో ఆదివారం నిర్వహించిన మెగా వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. కర్నూలు, నంద్యాల పట్టణాలకు చెందిన వైద్యులు వైద్యశిబిరంలో పాల్గొని రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో విద్యా సంస్థల డైరెక్టర్లు షేక్షావలి రెడ్డి, మౌలాలి రెడ్డి, గురురాఘవేంద్ర గురు రాజా విద్యా సంస్థల సిబ్బంది పాల్గొన్నారు.

కొలువుదీరిన పీర్లు

సంజామల, జూన్ 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లోని చావిడిలలో పీర్లను కొలువుదీర్చారు. మండల కేంద్రమైన సంజామలలో ఇమామ్ ఖాసీం, హజరత్ అబ్బాస్, హసన్ హుసేన్ పీర్లను కొలువుదీర్చి ప్రత్యేక ఫాతేహాలు సమర్పిస్తున్నారు. ఆయా గ్రామాలలోని కమిటీల ఆధ్వర్యంలో వచ్చే నెల 3న చిన్న సరిగెత్తు, 4న మధ్య సరిగెత్తు, 5న పెద్ద సరిగెత్తు, 6న షహదత్ వేడుకలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

కొండమనాయునిపల్లెలో కార్డన్ సెర్చ్

అవుకు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండమనాయునిపల్లెలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఆదివారం ఎస్‌ఐ రాజారెడ్డి మాట్లాడుతూ సీఐ మంజునాథరెడ్డి ఆధ్వర్యంలో అనుమానితుల ఇళ్లల్లో సోదాలు నిర్వహించామన్నారు. 50 లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని సరైన పత్రాలు లేని ఆరు మోటార్ సైకిళ్లను సీజ్ చేశామన్నారు. ఈ దాడుల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల పక్షాన పోరాడుతాం

డోన్ రూరల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రజల పక్షాన సీపీఐ నిరంతర పోరాటాలు చేస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి రంగనాయుడు అన్నారు. ఆదివారం దొరపల్లెలో పార్టీ గ్రామ శాఖ మహాసభను నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సుంకయ్య, రాధాకృష్ణ, నాయకులు నారాయణ, మోట రాముడు, లక్ష్మీనారాయణ, పులిశేఖర్, రామ్మోహన్, నాగరాజు పాల్గొన్నారు.

కాల్వ 'కేసీ' చూడరూ...!

- శిథిలావస్థలో కేసీ ఉపకాల్వ తూము షట్టర్లు
- పూడికతో నిండిపోయిన పంటకాల్వలు
- చివరి ఆయకట్టు భూములకు సాగునీరు అందని దుస్థితి

శిరివెళ్ల, జూన్ 29(ఆంధ్రజ్యోతి) : నంద్యాల జిల్లాలో వేలాది ఎకరాల భూములకు సాగునీటిని అందించే ప్రధాన వనరైన కేసీ కెనాల్ ఉప కాల్వలు అభివృద్ధికి నోచుకోవడం లేదు. కేసీ ఉపకాల్వకు అనుసంధానంగా ఉన్న తూముల షట్టర్లు శిథిలావస్థకు చేరుకుని నిరుపయోగంగా మారాయి. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో రైతులు వేసవి దుక్కులు చేపట్టి ఖరీఫ్‌కు సిద్ధమవుతున్నారు. ఖరీఫ్ ప్రారంభం కాకముందే పంట కాల్వల్లో పూడిక తీయడం, శిథిలమైన సిమెంట్ లైనింగ్‌కు మరమ్మతులు చేపట్టడం, ధ్వంసమైన తూము షట్టర్లను సరిచేయాల్సి ఉన్నప్పటికీ సంబంధిత శాఖ అధికారులు నిర్లక్ష్యం వీడలేదు.



శిరివెళ్ల మెట్ట వద్ద అధ్వానస్థితిలో కేసీ కెనాల్ ఉప కాల్వ తూము షట్టర్

చివరి ఆయకట్టుకు అందని సాగునీరు

రాయలసీమకు తలమానికమైన కేసీ కెనాల్ ద్వారా కర్నూలు, నంద్యాల, కడప జిల్లాల్లో లక్ష హెక్టార్లకు పైగా పంట పొలాలకు సాగు నీరు అందుతోంది. నంద్యాల జిల్లా పరిధిలో రైతులు వరి పంటను విరివిగా సాగు చేస్తున్నారు. కేసీ ప్రధాన కాల్వతో పాటు ఉప కాల్వల్లో పేరుకుపోయిన పూడికను తొలగించకపోవడంతో చివరి ఆయకట్టు రైతులకు సాగునీరు అందని దుస్థితి నెలకొంది. కాల్వల్లో సాగునీరు పారేందుకు ఎక్కడ చూసినా అడ్డంకులు ఏర్పడుతుండడంతో రైతులు ఇబ్బందులు పడుతూనే పంటలకు సాగునీటిని చేర్చుకుంటున్నారు. కేసీ ప్రధాన కాల్వకు అనుసంధానంగా ఉన్న ఉప కాల్వల్లో విపరీతంగా గుర్రపు డెక్క, పేరా గడ్డి, జమ్ముగడ్డి పేరుకుపోవడంతో నీటి ప్రవాహానికి తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. ఉప కాల్వల్లో సిమెంట్ లైనింగ్‌తో పాటు తూముల షట్టర్లు ధ్వంసమయ్యాయి. నంద్యాల జిల్లాలోని బండిఆత్మకూరు, నంద్యాల, శిరివెళ్ల, ఆళ్లగడ్డ, దొర్నిపాడు, చాగలమర్రి మండలాల్లోని వేల ఎకరాల చివరి ఆయకట్టు భూములకు ఏటా సాగునీటి సమస్య తలెత్తుతోంది. వేసవిలో ఉపాధిహామీ పథకం ద్వారా కాల్వల్లో పూడికతీత పనులు చేపట్టినట్లయితే సాగునీటి సమస్య కొంత మేర తీరేదని రైతులు వాపోతున్నారు.



పేరాగడ్డి, పూడికతో నిండిపోయిన కేసీ ఉప కాల్వ



నిరుపయోగంగా మారిన తూము

నంద్యాలకు తరలివెళ్లిన నాయకులు

డోన్ రూరల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి ఆదివారం డోన్ నుంచి వైసీపీ నాయకులు తరలి వెళ్లారు. పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డిని కలిశారు. కార్యక్రమంలో రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, డోన్ ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి, మండల అధ్యక్షులు సోమేష్ యాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్ హుసేన్, నాయకులు ఆర్‌ఈ రాజా వర్ధన్, దొరపల్లి చిరంజీవి, ప్రసాద్, ఎంపీటీసీలు, కార్యకర్తలు ఉన్నారు.

ఘనంగా గురుపూజ

అవుకు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చెన్నకేశవస్వామి ఆలయంలో ఆశాఢ శుద్ధ పౌర్ణమి గురుపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించినట్లు ఆర్‌ఎస్‌ఎస్ విభాగ్ సహబౌధిక్‌ప్రముఖ్ విప్రనారాయణచారి తెలిపారు. ఆదివారం ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులతో కలసి భరత మాత, గోల్‌వార్కర్, హెగ్డే చిత్రపటాలకు పూలమాల వేశారు. కాషాయజెండా ధ్వజాన్ని ఉంచి సభ్యులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం సభ్యులకు భగవద్గీత పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, దాసరి శ్రీనివాసులు, మేడం సతీష్, తల్లం సుబ్బనాగభూషణం, శంకర్, మద్దయ్య, మనోహర్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా జీవనం సాగించాలి

బేతంచెర్ల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్లు నేరాలకు పాల్పడకుండా ప్రశాంతంగా జీవనం సాగించాలని సీఐ వెంకటేశ్వరరావు సూచించారు. పట్టణంలోని పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో ఎస్‌ఐ రమేష్ బాబు ఆధ్వర్యంలో రౌడీషీటర్లకు సీఐ కౌన్సెలింగ్ ఇచ్చారు.

బహిరంగ సభను జయప్రదం చేయాలి

ఆళ్లగడ్డ, జూన్ 29(ఆంధ్రజ్యోతి): కర్నూలు పట్టణంలోని ఎస్టీబీసీ కళాశాల మైదానంలో సోమవారం నిర్వహిస్తున్న వక్ఫ్ సవరణ బిల్లు రద్దును నిరసిస్తూ చేపట్టిన బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆళ్లగడ్డ జేఏసీ కన్వీనర్ బీరుబాలబాష ఆదివారం కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం వక్ఫ్ సవరణ బిల్లును రద్దు చేసేంతవరకు తమ పోరాటాలు సాగిస్తామన్నారు.

ప్రజల మన్ననలు పొందడం అభినందనీయం

దొర్నిపాడు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ రీత్యా పదవీ విరమణ, బదిలీలు సర్వ సాధారణమని, ప్రజల మన్ననలు పొంది వారి హృదయాల్లో చిరస్థాయిగా నిలవడం అభినందనీయమని డీఎస్పీ ప్రమోద్ అన్నారు. ఆదివారం మండలంలోని లక్ష్మీ ఫంక్షన్‌హాల్‌లో ఎస్‌ఐ సత్యనారాయణ పదవీ విరమణ కార్యక్రమం నిర్వహించారు. ఎస్‌ఐను ఘనంగా సత్కరించారు. సీఐలు మురళీధర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, దస్తగిరిబాబు, ఎంపీడీవో సావిత్రి, నాయకులు సిద్ధి సత్యనారాయణ, వెంకట్‌నాయుడు సురేంద్ర, కృష్ణారెడ్డి, గోపాల్‌నాయుడు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు: సీఐ



గ్రామస్థులతో మాట్లాడుతున్న సీఐ రమేష్‌బాబు

కొలిమిగుండ్ల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో గొడవలు సృష్టించి, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని సీఐ రమేష్‌బాబు హెచ్చరించారు. ఆదివారం సాయంత్రం చింతలాయపల్లె గ్రామంలో సీఐ ఆధ్వర్యంలో ఎస్‌ఐ గోపాల్, ఏఎస్‌ఐలు, పోలీసులు సుమారు 20మంది సిబ్బంది వీధుల్లో కవాతు నిర్వహించారు. సారా, బెల్ట్ షాపులు, పేకాట లాంటి అసాంఘిక కార్యకలాపాలు చేపడితే చట్టరీత్యా కఠినచర్యలు తీసుకుంటామన్నారు.

దరఖాస్తులు చేసుకోండి: సీడీపీవో

ఆళ్లగడ్డ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని దొర్నిపాడు, రుద్రవరం, చాగలమర్రి, ఆళ్లగడ్డ, ఉయ్యలవాడ, శిరివెళ్ల మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని సీడీపీవో తేజేశ్వరి తెలిపారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ దొర్నిపాడు మండలం వెంకటేశ్వర నగర్‌లో 1 అంగన్‌వాడీ పోస్టు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. అలాగే దొర్నిపాడులో 1, (బీసీబీ), వెంకటేశ్వర నగర్ (ఎస్టీ), అర్జునాపురం(బీపీబి) కేటగిరిలో మూడు హెల్పర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అలాగే రుద్రవరం మండలంలో పేరూరులో(ఎస్సీ), కోటకొండ(ఓసీ జనరల్), పెద్దకంబలూరులో(బీసీడి), చాగలమర్రి మండలం లోని చిన్నబోదనం (బీసీసీ), డి వనిపెంట(జనరల్), ఆళ్లగడ్డ 8, ఉయ్యలవాడ మండలం పుచ్చకాయ లపల్లె, శిరివెళ్ల కేంద్రాలలో(ఓసీ)కి హెల్పర్ పోస్టులు ఉన్నాయన్నారు. పదో తరగతి చదివి 18 నుంచి 35 సంవత్సరాల లోపు నిరుద్యోగులు జూలై10లోగా దరఖాస్తులు చేసుకోవాలని అన్నారు. మరిన్ని వివరాలకు ఆళ్లగడ్డలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.


అవుకు..

అవుకు : బనగానపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా పోస్టులకు మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ సీడీపీవో ఉమామహేశ్వరమ్మ ఆదివారం తెలిపారు. సీడీపీవో మాట్లాడుతూ అవుకు మండలంలో అంగన్‌వాడీ కార్యకర్త పోస్టు ఒకటి ఖాళీగా ఉండగా, ఆయా పోస్టులు రెండు ఖాళీగా ఉన్నాయన్నారు. బనగానపల్లె మండలంలో ఆయా పోస్టులు మూడు ఖాళీగా ఉన్నాయని అన్నారు. అవుకు మండలం పిక్కలిపల్లితండాలోని అంగన్‌వాడీ కార్యకర్త పోస్టు ఎస్టీకి కేటాయించగా, కొండమనాయునిపల్లె ఆయా పోస్టు ఓసీ జనరల్, చెన్నపల్లె - 2 బీసీ - బీ, బనగానపల్లె - 3 బీసీ-ఈ, చిన్నరాజుపాలెం బీసీ-బీ, పెద్దరాజుపాలెం బీసీ - బీ కేటగిరీలకు కేటాయించినట్లు తెలిపారు. జూలై 10లోగా బనగానపల్లె సీడీపీవో కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు.

గ్రామాల్లో అలుముకుంటున్న చీకట్లు

- అప్రకటిత కోతలతో అల్లాడుతున్న మండల ప్రజలు
- చిరు గాలి వీచినా .. చినుకు పడినా కట్ అవుతున్న కరెంట్
- కీలకమైన ఏఈ, లైన్ ఇన్‌స్పెక్టర్ కొరతతో ఇబ్బందులు

కొలిమిగుండ్ల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో విద్యుత్ సరఫరా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో నిత్యం చీకట్లు అలుముటుంటున్నాయి. విద్యుత్ శాఖలో కీలకమైన ఏఈ, లైన్ ఇన్‌స్పెక్టర్ పోస్టులు ఏళ్ల తరబడి ఖాళీగా ఉండటంతో విద్యుత్ సరఫరా సాఫీగా సాగడంలేదు. ముగ్గురు లైన్‌మెన్లు, ముగ్గురు అసిస్టెంట్ లైన్‌మెన్లు, 13మంది జెఎల్‌ఎంలు మొత్తం 19మంది సిబ్బంది అందుబాటులో ఉన్నా అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడటంతో పనులు చేసే నాథుడే కరువయ్యారు. చిన్న గాలి వీచినా, చిరు జల్లులు కురిసినా గంటలు, రోజుల తరబడి గ్రామాల్లో చీకట్లు అలుముకుంటున్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపంతో సిబ్బంది సమయానికి స్పందించకపోవండతో ప్రజలకు కష్టాలు తప్పడంలేదు. విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యం, లైన్ వ్యవస్థలో లోపాల కారణంగానే ఇలా కరెంటు కోతలు ఏర్పడుతున్నట్లు ప్రజలు వాపోతున్నారు. మండలంలో పరిశ్రమలకు సంబంధించి 450 సర్వీసులు ఉండగా, రైతులకు సంబంధించి 2200 సర్వీసులు ఉన్నాయి. మరోవైపు గృహ అవసరాలకు సంబంధించి సుమారు 11000 సర్వీసులు ఉండగా, రూ.కోట్లాది రూపాయాల ఆదాయం లభిస్తోంది. అయినా విద్యుత్ సరఫరా సవ్యంగా సాగకపోవడం పట్ల పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాపరాళ్ల పరిశ్రమలు అధికంగా ఉన్న మండలంలో విద్యుత్ అధికారుల కొరత ఎంతమాత్రం తగదని పరిశ్రమ నిర్వాహకులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఏఈ, లైన్ ఇన్‌స్పెక్టర్ల నియామాకం చేపట్టి, విద్యుత్‌ను సక్రమంగా ఇవ్వాలని కోరుతున్నారు.



కొలిమిగుండ్లలో కరెంటు పోవడంతో అలముకున్న చీకట్లు

తూకాల్లో దగా

- క్వింటానికి 15 కిలోలు దోపిడీ
- గగ్గోలు పెడుతున్న రేషన్ డీలర్



50 కేజీల ప్యాకెట్‌కు 4కేజీలు చూపిస్తున్న తూకం

ప్యాపిలి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక సివిల్ సప్లై అధికారులు దోపిడీకి పాల్పడుతున్నారు. క్వింటానికి కిలోల కొద్ది దోపిడీ చేస్తున్నారు. దీంతో ఇలా తూకాల్లో తేడా ఉంటే పేదలకు బియ్యం ఎలా పంపిణీ చేయాలని మండలంలోని డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని రామ క్రిష్ణాపూర్ దుకాణం డీలర్ రేషన్ బియ్యం తీసుకెళ్లాడు. ఇంటి దగ్గరకు వెళ్లి తుకాలు వేస్తే క్వింటానికి 15 కిలోలు బియ్యం తక్కువ వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి నెల తుకాల్లో మోసం చేస్తున్నారని డీలర్ ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సివిల్ సప్లై గోదాములో అక్రమాలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని రేషన్ డీలర్ కోరుతున్నారు.

పట్టపగలే సిట్టింగ్‌లు

● మందుబాబుల అడ్డాగా చెత్త సంపద తయారీ కేంద్రం



పెద్దపూదిళ్ల గ్రామంలోని సంపద తయారీ కేంద్రం

ప్యాపిలి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దపూదిళ్ల గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం మందుబాబులకు అడ్డాగా మారింది. పట్టపగలే మందుబాబులు సిట్టింగ్‌లు వేస్తున్నట్లు విమర్శలున్నాయి. పెద్దపూ దిళ్ల గ్రామంలో గత ప్రభుత్వం లో రూ.3లక్షల వ్యయంతో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని నిర్మిచారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామి పథకం క్రింద ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన ఆ కేంద్రాన్ని అధికారులు ఏ మాత్రం విని యోగంలోని తీసుకురాలేదు. కేంద్రంతో పాటు అందులోని తొట్లు శిథిలమయ్యా యి. దీంతో కేంద్రానికి వెచ్చించిన రూ. లక్షలు దుర్వినియోగమయ్యాయన్న విమ ర్శలు ఉన్నాయి. చెత్త సంపద తయారీ కేంద్రం నిరుపయోగంగా మారడంతో మందు బాబులకు అడ్డాగా మారింది. దీంతో అటువైపు వెళ్లాలంటే మహిళలు ఇబ్బంది లకు గురవుతున్నారు. అధికారులు స్పం దించి రూ. లక్షలు వెచ్చించి నిర్మించిన చెత్త సంపద తయారీ కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఇంటింటికి రేషన్ పంపిణీ

డోన్ టౌన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): వృద్ధులకు, దివ్యాంగుల ఇంటి వద్దకే వెళ్లి రేషన్ పంపిణీ చేసినట్లు టీడీపీ నాయకుడు గోరంట్ల అశోక్ కుమార్ తెలిపారు. ఆదివారం కొచ్చెర్వులో లబ్ధిదారులకు ఇంటింటికి వెళ్లి రేషన్ పంపిణీ చేశామ న్నారు.

మాట నిలబెట్టుకున్న సీఎం

చాగలమర్రి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): సూపర్-6 పథకాల్లో తల్లికి వందనం పథకాన్ని అమలు చేసి సీఎం చంద్రబాబు మాట నిలబెట్టుకున్నారని బీసీ సంఘం మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణగౌడ్ అన్నారు. ఆదివారం బీసీ సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మిగితా పథకాలు కూడా త్వరలోనే అమలవుతాయన్నారు. సమావేశంలో బీసీ సంఘ నాయకులు రామతీర్థం, వీరయ్య, సుబ్బరాయుడు, పిచ్చయ్య, చిన్నికృష్ణయ్య, వాసు, లాలయ్య పాల్గొన్నారు.

గర్భిణుల, బాలింతలకు ఈకేవైసీ

చాగలమర్రి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో గర్భిణులు, బాలింతల వివరాలను ఈకేవైసీ చేస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీల తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీల ద్వారా పౌష్టికాహారం కోసం సమన్వయకర్తలు ముఖ చిత్రం నమోదు చేస్తున్నారని అన్నారు. 3నుంచి 6 సంవత్సరాలు వయసుగల పిల్లలకు ఈకేవైసీ చేస్తున్నామని అన్నారు. 53 కేంద్రాల్లో 80 శాతం ఈకేవైసీ చేశామని అన్నారు. అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బడిబయట ఉన్న చిన్నారులను బడిలో చేర్పిస్తున్నామన్నారు.

వీవోఏలను తొలగించలేదు

చాగలమర్రి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నేలంపాడు, తోడెండ్లపల్లె గ్రామాల్లోని వీవోఏలు, పొదుపు సభ్యులను తొలగించే అధికారం తమకు లేదని ఏపీఎం నాగమ్మ తెలిపారు. ఆదివారం వీవోఏలను తొలగించడం సరికాదు అన్న కథనం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైంది. దాంతో ఏపీఎం స్పందించారు. వెలుగు సీసీలు, తమకు ఎలాంటి సంబంధం లేదని అన్నారు. పొదుపు సంఘాల సభ్యుల్లో విభేదాల వల్ల ఆన్‌లైన్‌లో వారే తొలగించుకున్నారని అన్నారు. వీవోఏల తొలగింపులో తాము ఎలాంటి జోక్యం చేసుకోలేదని అన్నారు.

వాగులు, వంకల్లో పూడికతీత

రుద్రవరం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాగులు, వంకల్లో పూడికతీత, చెట్లు తొలగింపు పనులు చేపట్టినట్లు ఎంఐఏఈ రఘురాముడు ఆదివారం తెలిపారు. వర్షాలు కురిసినప్పుడు వాగుల వెంట చెరువులకు నీరు చేరేందుకు పూడిక, కంపచెట్లు అడ్డంకిగా మారాయన్నారు. వాటిని తొలగించి పూడికను తీసివేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఒక్కో పనికి రూ.5.50లక్షలు కొండమాయపల్లె చిన్నరాజచెరువు, రుద్రవరం పెదరాజ చెరువు, బి.నాగిరెడ్డిపల్లె సోమయాజులపల్లె మూడు చెరువులకు రూ.16.50లక్షలు నిధులు మంజూరయ్యాయని ఆయన తెలిపారు.

లింగమయ్యకు ప్రత్యేక పూజలు

రుద్రవరం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముత్తలూరు గ్రామ సమీపంలో కొలువుదీరిన లింగమయ్యస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు

రుద్రవరం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని యల్లావత్తుల, కొండమాయపల్లె, రుద్రవరం గ్రామాల్లో గ్రామ దేవతలకు ఆదివారం పూజలు చేశారు. అర్చకులు అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. సుంకులమ్మ, మారెమ్మ, పెద్దమ్మ అమ్మవార్లకు మహిళలు బోనాలు సమర్పించారు.

నేడు రామ్‌కో పరిశ్రమ వద్ద ధర్నా

కొలిమిగుండ్ల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రామ్‌కో సిమెంట్ పరిశ్రమ వద్ద సోమవారం సీపీఐ, రైతు సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు కొలిమిగుండ్ల రైతు సంఘం నాయకులు వెల్లడించారు. యాజమాన్యం వ్యవహార శైలికి నిరసనగా చేపడుతున్నట్లు తెలిపారు.

సహకార సంఘాల చైర్మన్లుగా వివేక్, శివారెడ్డి




వివేకానందరెడ్డి



మూల శివారెడ్డి

కొలిమిగుండ్ల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని హనుమంతుగుండం, కొలిమిగుండ్ల సహకార సంఘాలకు చైర్మన్లుగా అంబటి వివేకానందరెడ్డి (కొలిమిగుండ్ల), కోటపాడు గ్రామానికి చెందిన మూల శివారెడ్డి(హనుమంతుగుండం) ఎంపిక అయ్యారు. తమకు అవకాశం కల్పించిన మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

సంజామల సహకార సంఘం చైర్మన్‌గా కిరణ్ కుమార్



కిరణ్ కుమార్

సంజామల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): సంజామల సహకార సంఘం చైర్మన్‌గా పెండేకంటి కిరణ్ కుమార్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పలు పదవులు చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.